వార్త - ఆదివారం 2004

# ఒక పాట మరణం

ఆకాశం నిండా నల్లటి మబ్బులు...

చల్లటి ఈదురుగాలి...

హోరుమంటోంది.

కుండపోతగా వర్షం ఖాయం...

ఎదురుగా కడుతూన్న ఇంటి వెంటిలేటర్లోంచి గాలి ఈలవేస్తూ వెళ్తోంది.

పశ్చిమ ఆకాంలో నల్లని మబ్బుల్ని చీల్చుకుని ఓ రక్తరేఖ...

ఎదురింటి వెంటిలేటర్ నోటితో వెర్రిగాలి ఈలపాట.

* * *

'సంధ్యారుణిమల్ని పారదర్శకమైన నాలోంచీ చూస్తూ... నువ్వు దిగంబరంగా నన్ను మెటీరియలైజ్ చేసుకుంటూ నన్ను వింటున్నాననుకునే భ్రమాశబ్దం... నీ పరిభాషలో పాట...

మోహక్షణాలు ఎక్కడికో ఎడారుల్లోకి పారిపోయిం తర్వాత... ఆ పాట నిశ్శబ్దంగా నీరు గారిపోతుంది.

అప్పుడు ఊహామాత్రంగా కూడా నీకు పాట వినిపించదు.

ఆ పాట చచ్చిపోతుంది'.

'ఝూన్సీ! అర్థంకాని భాష మాట్లాడకు'

'అవున్లే నీలాంటివాడికి శరీర భాషే తెల్సు'

'ఝూన్సీ ప్లీజ్!'

'ఓకేరా మగడా నీకోసం నా ప్రేలాపనాపుతాను'.

* * *

ఎన్నాళ్లైంది పాట నానించీ విడిపోయి...?

ఝూన్సీకి తెల్సు. లేదూ పాటనించీ నేనే విడి పడిపోయానా...! కావేరికి తెల్సు

స్వరార్ణవ సైకతాలమీద నేనడిచొచ్చిన నా అడుగుజాడలెక్కడ? ఎవరు చెరిపేసారు...?! జవాబు? డబ్బో... ఇమడలేనితనమో... పాటకే తెల్సు.

* * *

'పురుషసూక్తం మీ అబ్బాయి చదూతోంటే అట్లా వింటూ వుండిపోవాలనిపిస్తుందమ్మా! యంత మంచి స్వరమో'!

"గాతుం యజ్ఞాయ

గాతుం యజ్ఞపతయే"

ఎవరు ఏ యజ్ఞాన్ని గానం చేస్తారు

ఏ యజ్ఞపతిని గానం చేస్తారు?

యజ్ఞం స్త్రీనే

యజ్ఞపతి స్త్రీనే

గానం? ఎక్కడ్నించీ, ఎక్కడికి... సరళీస్వరాల దారుల్లోంచీ... చీకటి వీధుల్లో చిరిగీ...

సుఖ్‌రాం బిద్రీ... ఇరుకుగది... చిన్న కిటికీ లఖ్మీవీ బాసురీ...

చంద్రిక... బిలావత జన్య షాడవ రాగం...

తిలక్ కామోద్. ఖమాజ్ నించీ జాలువారి

నంద్... కల్యాణీ... రెండు మధ్యమాల మధ్యనించీ...

'తూ జహా జహా చలేగా మెరా సాయా సాథ్ హోంగా...'

లతా లతా...

ఎక్కడికి వెళ్ళిపోయింది పాట

ఏడు రెక్కల్తో ఎగిరిపోయిందే...

* * *

హోరున వర్షం.

ఒక్కసారిగా గాలి స్తంభించిపోయింది...

నిట్టనిలుగా వర్షపు ధారల మసకతెర...

ఆవలి ప్రపంచాన్ని ఓ మసక నీడన్చేస్తూ...

బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం

తుఫాను...

ప్రళయంలా వుంది...

ఇలాగే కురుస్తూ పోతే!

రోజుల తరబడి...

కొత్త నోవా ఎక్కడో ఓడ చేసుంటాడా...

నోవా ఓడనో...

మఱ్రాకుమీద దిగంబర బాలకృష్ణుడో... ఏదోలే...

నిన్న... నిన్ననే

ఈ తుఫానుకు గతమైన నిన్నను... గాలాడని ఉక్కపోత చెమట... పదకొండున్నరకి... హరికిషన్ పెళ్ళి... డాక్టర్హర్కిషన్స్ లవ్మ్యారిజ్...

ప్రేమవివాహం... పెద్దలొప్పిన ప్రేమపెళ్ళి.

దేవీ ఫంక్షన్ హాల్లో గిఫ్ట్గా రమణగాడి నలుగురు పాండవులు తీసికెళ్ళా...

* * *

రమణయ్య నాకు పరిచితమైన పాతపాట.

రమణయ్యకూ నల్గురు పాండవులకూ లింకసలే లేదు...

అతనో నడుస్తున్న పాటలపెట్టె...

పెళ్ళి దగ్గర ప్రత్యక్షమయ్యాడు...

అతని దగ్గర యిన్నేళ్లైనా పచ్చిగా పాటల వాసనే...

స్వర పరిమళం...

ఓ అయిదారు సాహితీ స్వప్నాల మధ్యన పచ్చటి పాటలా రమణయ్య...

అతని చుట్టూ చేరిన కలలు అభ్యుదయ సాహిత్యాన్ని శ్వాసిస్తున్నాయి.

ఫంక్షన్ హాలు చాలా పెద్దది...

దానికెదురుగా నాగరికంగా వేసిన నాజూకు పాకలు...

ధాబా

అక్కడ మత్తు అనఫిషల్గా ఖరీదుకు ఆవరిస్తుంది...

భోజనాలముందు అందరం రమణయ్యతో పాటు... ధాబాలోకి వలసవెళ్ళాం.

రమణయ్య నాలా వయసుని రంగుతోనూ వాటితోనూ దాకుచునే ప్రయత్నం చేయలేదు.

నెరసిన వెంట్రుకలూ... నెరసిన మీసాలూ...

ఆ మీసాలకింద నల్లని పెదవులూ... ఆ పెదాల మధ్య అప్పటిదే ఎప్పటిదో పురాతనమైన ఆ పాట.

ఓ పావు'రం' ఎగిరిపోయిం తర్వాత

"రమణయ్యా పాట..." దేబరించా...

రమణ్య స్వరం సవరించుకున్నాడు...

పాట తర్వాత పాట...

పద్యం తర్వాత పద్యం...

సినెమా పాటొకటి

రమణయ్య స్వీయ రచన స్వయంగా స్వరపరిచిందింకో గీతం...

వెదురు తడికెలు విడిపోయి వేణువులైనై, పైకప్పు ఎండినరెల్లుగడ్డి చివురించసాగింది.

చివురించి చివురించి హరితాన్ని పలవరించసాగింది.

స్వరాలూ వర్ణాలు నాలోంచి ప్రవహించి వెళిపోయి ఎండిపోయి బీటలు వారిన చెరువు గర్భంలా అయిన నా గుండె మీద... పాటల తడి.

నెమనెమ్మదిగా తడికాస్తూ మడి కట్టుకుంది...

గుండె హాయిగా పాటను పీల్చుకుంది...

తడిసిన గుండెతో పెళ్ళి భోజనాన్ని వదిలి... పాటని మోస్తూ... చుట్టూ వున్న ప్రపంచానికీ నాకూ మధ్య స్వరాన్ని కవచంగా చేసుకొని యువసాహితీ స్వప్నాలను వాళ్ళ వాళ్ళ అభ్యుదయాల కొదిలేసి వచ్చేసా...

* * *

కుండపోతగా కురుస్తున్న వర్షానికి తోడు, యింతవరకూ బిగబట్టుకున్న గాలి ఒక్కసారిగా చెలరేగసాగింది...

కిటికీ రెక్కలు బిగించి... దానికి బిగించిన గాజు పలకలోంచి అసలే మసగ్గా వున్న వాన చిత్రాన్ని యింకా మసకబర్చుకుని చూస్తున్నా.

పడక పడక నలభైమూడేళ్ళకి ఎండిన గర్భ కుహరంలో పడ్డ ఓ పచ్చి ప్రాణిని ప్రసవించడానికి కావేరి పూరెళ్లింది.

నా చుట్టూ ప్రకృతి బీభత్స నాదాలు ఫెళ ఫెళా చేస్తున్నా... లోపల లోలోపల ఏదో ఎప్పటిదో నాకు మాత్రం వినిపించే ఓ నిశ్శబ్దం...

వినిపించని శబ్దాలూ స్వరాలూ వున్నట్టు

బేతోవన్ ఒక్క స్వరం కూడా విన్పించకపోయినా ఎంత సంగీతాన్ని సృష్టించలే... వాళ్ళు సృజనకారులు.

నేనూ... నాలాంటివాళ్ళు విధ్వంసకారులం.

నిశ్శబ్దాలని సృష్టించి సృష్టించుకునీ వినమనీ వింటూ... ఓ జీవితంలో మరణిస్తుంటాం.

నిజం నిజం...

ఈనిజానికి సాక్ష్యం నా మరణించని పాటే... కుయ్ కుయ్మని చిన్న శబ్దం...

వెంటిలేటర్‌లో గూడుకట్టిన పిచుక పెట్టిన పిల్లల్లోంచి ఓ చిన్ని పిచుక పిల్ల కిందపడింది.

రెక్కలు రాని పిచుకపిల్ల...

పాటరాని పిచుక...

కాని పాటగా పరిణమించే ఆ పురాతన స్వరాన్ని గొంతులో భద్రపరచుకున్న పిచుక పిల్ల.

ఈకలు రాక... ఎర్రగా... బట్టతలతో

రోజా రంగుతో కుయ్‌కుయ్‌మంటూ... ఓ కాలు పైకెత్తి నడవడానికిపోయి వెల్లకిలాపడి, కుయ్‌మని...

అమాయకంగా గుండ్రని కళ్లు మిటకరిస్తూ...

అసహాయంగా...

జీవించాలని...

ఎగరాలని...

రెండు సంధ్యల సకల వర్ణాల్నీ అందంగా పరిణమించబోయే చిన్ని రెక్కలమీద మోయాలనీ కలలు కంటూ... పాపం ఆ పిచ్చి పిచుక పిల్ల

అసహ్యంగా...

నిజమేనేమో! అందానికి ముందు జన్మ అసహ్యమేనేమో

మడత నిచ్చెనేసుకొచ్చి... అసహ్యంగా వున్న ఆ పిచుక పిల్లని వెంటిలేటర్లోకి చేర్చా... ఏదో తెలీని వూరట...

ఓ చిన్న శాంతి వీచిక.

* * *

వర్షం ఉధృతమవుతోంది...

గాలిహోరు హెచ్చింది.

తలుపెవ్వరో దబదబా బాదుతోన్నారు...

కాలింగ్బెల్లేమైంది...?

గమనించా నాచుట్టూ చిక్కగా చీకటి పేరుకు పోయుంది...

తలుపు తెరిచా...

మసక మసగ్గా ఓ స్త్రీ ఆకారం!

గుప్పున లైటు వెలిగింది...

నా ఎదురుగా ఝాన్సీ...

తడిసి ముద్దైన ఝాన్సీ...

తన పాదాల చుట్టూ ఆమె వంటిమీంచి ప్రవహించి జారిన నీటిమడుగు... లేత నీలం రంగు చీరలో ఝూన్సీ.

కరిగిపోతూ కరిగిపోతూ కదిలొచ్చి నా ముందు నిల్చున్న మంచు శిల్పంలా...

ఝూన్సీ కరిగిపోతూ కదిలిపోయి బాత్రూంలోకి మాయమైంది...

కాస్సేపటికి

బాత్రూం తలుపు తెరిచి "కొన్ని పొడిబట్టలూ ఓ తువ్వాలూ పారేయ్ నా ముఖాన నిట్రాయిలా నుంచున్నావ్" అరిచింది.

మాట ముద్దగా వస్తోంది...

యస్ ఝూన్సీ తాగుంది...

వెళ్ళి ఓ తువ్వాలూ కావేరిది ఓ నైటీ తీసుకెళ్ళిచ్చా...

కాసేపట్లో బాత్రూం తలుపు బార్లా తెరుచుకుంది...

ఝూన్సీ వదిలేసిన తడిబట్టలు గుట్టగా పడున్నాయి...

కావేరి నైటీలో విరబోసుకున్న తల తుడుచుకుంటూ బైటికొచ్చి సోఫాలో కూలబడిపోయింది ఝూన్సీ.

కళ్ళు మందారాల్లా వున్నాయి.

బహుశ బాగా ఏడ్చుండాలి...

లేదూ తాగడం నుంచా...

"ఓ లార్జ్ విస్కీ యివ్వు" ముద్దగా అంది.

గ్లాసు చేతికందించా...

ఝూన్సీ కళ్లలోంచి నీళ్లు కారుతున్నాయి.

గ్లాసు వున్నపళంగా సగానికి ఖాళీ చేసేసి టీపాయ్ మీద పెద్ద చప్పుడు చేస్తూ పెట్టి తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకుంది.

మూసుకున్న ఆమె కనెప్పుల్ని నీటితడి ఆగకుండా విడదీయడానికి యత్నిస్తోంది...

* * *

అనేస్తీషా అనేవాళ్ళం ఝూన్సీ ని..

నిజం ఓ మత్తుపాట ఝూన్సీ...

ఝూన్సీ ఓ విశృంఖల గీతం...

ఎవ్వరూ బంధించలేరు...

ఝూన్సీ అనే పాట ఓ ఝురి...

ఆమె ఒడ్డున నుంచుని ఎవరి దోసిళ్ళకు దక్కింది వాళ్ళు గ్రోలాల్సిందే...

సొంతం పట్టుపడే పాటకాదు, ఝూన్సీ...

ఒకప్పుడు నేను విన్న ఆ పాట... ఈ రోజున కృష్ణుడు వింటున్నాడు...డా? తెలీదు..

* * *

"రేయ్ దూయూ లవ్ యువర్వైఫ్ కావేరీ?"

గట్టిగా అరిచింది ఝూన్సీ...

అవునన్నట్టు తలూపా...

"ఒట్టు పెట్టుకుంటావా?"

మళ్ళీ తలూపా

"పర్జురీ... పర్జురీ... దొంగ ఒట్ల దొంగ వెధవల్లారా" నవ్వింది...

కానీ అది నవ్వు కాదు...

"ఝూన్సీ ఏమైంది వాట్రాంగ్?" మెల్లిగా అడిగా...

తలడ్డంగా వూపి మళ్ళీ కళ్ళు మూసుకుని తల వెనక్కి వాల్చింది...

కాలింగ్బెల్ మోగింది...

కృష్ణుడు... వాడు తడవలేదు కార్లో వచ్చాడు... అసహనంగా వున్నాడు... ఝూన్సీన్చూసి నిట్టూర్చి ఆమెకు దూరంగా ఊయల్లో కూచున్నాడు.

నాకర్థంకాని నిశ్శబ్దాన్ని వాళ్ళే... వాళ్ళిద్దరే నాకు తెలియజేయాలి...

నాకర్థమైన అతికొద్ది విషయం కృష్ణుడూ ఝూన్సీ గొడవపడ్డారు... అది కూడా తీవ్రస్థాయిలో...

వాళ్ళిద్దర్నీ వాళ్ళకే వదిలేసి నేను నా గదిలో కొచ్చి తలుపేసుకున్నా...

చాలాసేపు నిశ్శబ్దం...

తర్వాత అరకొరగా మాటలు గాలివాటుకు కొట్టుకొచ్చినట్టు ముక్కలు ముక్కలుగా నా గదిలోకి...

కృష్ణుడు బతిమాలుతున్నట్టు కొద్దిసేపు...

ఝూన్సీ ముద్దలు ముద్దలుగా అరుపులు యింకొంచెం...

వినకూడదనుకున్నా వినబడుతూనే వున్నాయి వాళ్ళ సంభాషణలనబడే రగడపు తునకలు.

"మమ్మల్ని కుట్టిపోయే దోమల్లాంటి వాళ్ళు మీరు... మమ్మల్నేమో చేసామనుకుని విర్రవీగుతారు.

మీ చేతనైనతనం...

చుక్కలు చుక్కలు... బంక...

చెంబుడు నీళ్ళు తెల్సా... బాస్టర్డ్...

యూనో దూష్....

మా ఓ చిన్న కోర్కెని తట్టుకొని నిలుపుకో గలర్రా మీరు..."

"ఝూన్సీ.... ప్లీజ్"

"గెట్లాస్ట్... యూ ఆర్ నథింగ్ టు మీ"

తలుపు గట్టిగా మూసి బోల్ట్ చేసా...

కాస్సేపటికి కృష్ణుడి కారు వెళ్ళిపోయిన శబ్దం కిటికీలోంచి...

తలుపు తీసుకు బైటికొచ్చా హాల్లోకి...

ఝూన్సీ గ్లాసులోకి విస్కీ వొంపుకుంటోంది... తడబడుతోంది.

వెళ్ళి చెయ్యి పటుటకుని... "ఝూన్సీ చాలు యిప్పటికే ఎక్కువైనట్టుంది. చాలు ఆపేయ్" అన్నా.

"ఏం మీ మగపురుగులు మాత్రమే తాగి పడిపోవచ్చా..." ముద్దముద్దగా అంది... చెయ్యి వదిలేసా... నిస్సహాయంగా.

"ఆఁ" అని రాగం తీస్తూ వచ్చి సోఫాలో కూచుంది.

గొంతు నిలకడగా లేదు...

'అనెస్తీషా' అనుకున్నా.

"నేనెవర్నైనా మోసం చైగల్నా చెప్పు... చెప్పు" నాభుజం పట్టుకునూపుతూ అడిగింది.

లేదన్నట్టు తలడ్డంగా వూపాను...

"మరి వాడట్లా గంటాడేం? నిజంగా అడత్తల్చుకుంటే మీరు పచ్చడన్నంతో మొదలుపెట్టి పెరుగన్నాని కొచ్చేలోపల మీరనుకునే ఆ నాన్సెన్స్ ముగించుకురాగల్దు నిజం చెప్పు...

మాకేం కావాలో మీకు తెల్సా..."

ఝూన్సీ కళ్ళు ధారగా స్రవిస్తున్నాయి.

"ఒక్క నిజం చెప్పనా? మాకు నిజానిక్కావల్సింది ఓ యుగావిష్కరణ...

మాలోకి ఓ నాగరికతను ప్రవేశపెట్టే చేవ మీ మేధలకీ లేదు మీ మేధలకస్సల్లేదు...

యంత మంది మగాళ్ళకాపన్చేత్తౌనూ? ఇన్సెక్ట్స్" ఆయాసంగా ఆగి

"పు... రు... గు... ల్లా... రా?" గట్టిగా అరిచింది. భయమేసింది.

"ఝూన్సీ ప్లీజ్ కంట్రోల్యువర్సెల్ఫ్" గాబరాగా అన్నా.

ఝూన్నీ దాదాపు బాహ్యాస్పృహ కోల్పోయింది.

"లంజాకొడకల్లారా శబ్దాలూ మూలుగులూ నిట్టూరులూ బట్టల రెపరెపలూ

వాసన్లూ వీటితో అడదానికి సంబంధించిన ఈక్వేషన్ తయారుచేసుకుని బాత్రూంకీ బెడ్రూంకీ డిఫరెన్స్ మరిచార్రా..."

సోఫానించీ కిందికి జారి పడింది...

అస్పష్టంగా వ్యక్తా వ్యక్తంగా గొణగసాగింది.

"మీరు పాడే పాత పాటల్లేవ్"

'మా ఒక్కో చరణం మీకు కోటి మరణాలు'

'మేం... నే... పాటన్రా...' చిన్నగా గురక మొదలైంది...

కాళ్ళు సరిచేసి తలకింద ఓ దిండు పెట్టి... వెళ్ళి నాగదిలో మంచంమీద వాలిపోయా...

* * *

ఉదయం లేచేప్పటికి ఝాన్సీ లేదు వెళ్ళిపోయింది... తలుపు ఆటో లాక్‌చేసి...

బాత్రూంలో తను వదిలేసిన బట్టలలాగే గుట్టగా పడున్నాయి.

హాల్లో ఓ వారగా చీమల పుట్ట కనిపించింది. దగ్గరగా వెళ్ళిచూసా. రెక్కలు రాని పిట్ట... ఎగరలేని పిట్ట... ఈకల్రాని పిట్ట చచ్చిపడుంది.

తలుపు తెరిచా...

తూర్పుకు రంగులపాట విన్పించకుండా మబ్బుల మఫ్లర్లు బిగించబడున్నాయి...

పనిపిల్ల రాలే...

న్యూస్పేపర్లో చనిపోయిన పిచుకపిల్ల నెత్తి కాంపౌండ్ బైటపడవేసా...

పాటకాబోయి మరణించిన స్వరాన్ని విసిరేసినట్టు...

మనస్సంతా కకావికలుగా వుంది...

ఫోన్రింగైంది...

కావేరి వాళ్ళన్న... కావేరి ఆడపిల్లని ప్రసవించింది...

ఓ పాట జన్మించింది...

ఝాన్సీ?

అనెస్తీషా?

ఓ విశృంఖల గీతం?

మళ్ళీ ఫోన్రింగైంది...

ఈమాటు రమణయ్య "ఈరోజు సాయంకాలం వస్తానన్నావు నీకోసం చూస్తుంటా" అని.

* * *

సాయంకాలం వెళ్ళా రమణయ్య ఇంటికి... సాదరంగా ఆహ్వానించాడు...

భార్యనూ, కూతుర్నీ పిలచాడు...

"నేనాలపన ఈమె పల్లవి... యిది చరణం" అన్నాడు.

"పేరేంటి అమ్మలూ" అడిగా

"షణ్ముఖప్రియ"

"అవునూ నువ్వు వేణువు అదీ వాయిస్తూ సంగీతం నేర్చేవాడివి కదా?" రమణయ్య

"పాట చచ్చిపోయింది రమణయ్యా" అన్నాను...

అందుకు రమణయ్య అన్నాడు

"తప్పు తప్పు పాటకు చావు లేదు... ఏమీ అనుకోకు బహుశా నువ్వు చనిపోయుంటావు"

❀